ఆధునికంగా ఐటిఐలు

- రూ.2,324.21 కోట్లతో అభివృద్ధి చేస్తాం
- టాటా టెక్నాలజీస్‌తో ఒప్పందం
- నైపుణ్యంలేని సర్టిఫికెట్లు దేనికీ పనికి రావు
- యువతకు శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐటిఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా (ఎటిసి) తీర్చిదిద్ది, యువతకు ఆధునిక శిక్షణ అందించనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మల్లేపల్లి ఐటిఐ ప్రాంగణంలో ఎటిసి ప్రాజెక్టుకు మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. 40, 50 ఏండ్ల కిందటి నైపుణ్యాలను ఐటిఐల్లో నేర్పిస్తున్నారనీ, వాటి వల్ల ఉపాధి లభించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తాను హైదరాబాద్‌లో ఇల్లు నిర్మించేటప్పుడు చాలా మంది ఇంజనీరింగ్ చేసిన వారు వచ్చి రూ.15, 20 వేలకు పని చేస్తామని వచ్చారనీ, నిర్మాణరంగంలో అనుభవమున్న తాపీమేస్త్రీని సంప్రదిస్తే రూ.60 వేలు ఇస్తేనే వస్తానని చెప్పారని గుర్తు చేశారు. నైపుణ్యం లేని పట్టాలు ఎందుకు పనికి రావని ఆరోజే తనకు అర్థమైందని చెప్పారు. "40 లక్షల మంది యువతీ యువకులు ఉపాధి లేక రిక్రూట్మెంట్ బోర్డుల చుట్టూ తిరుగుతున్నారు. నా ఆలోచనల నుంచి వచ్చిందే ఎటిసిసెంటర్స్.. సర్టిఫికెట్ ఉంటే సరిపోదు. సాంకేతిక నైపుణ్యం ఉంటేనే ఉపాధి లభిస్తుందని నేను నమ్ముతున్నాను. దుబాయ్ లాంటి దేశాలకు వలసలు వెళ్లకుండా ప్రభుత్వం ఉపాధి గ్యారెంటీ ఇస్తుంది. టాటా సంస్థ సహకారంతో సాంకేతిక నైపుణ్యాల కోసం రూ.2,324 కోట్లతో 65 ఐటిఐలను ఎటిసిలుగా మారుస్తున్నాం. ఈ శాఖ నా దగ్గరే ఉంది. నేనే స్వయంగా ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తా. మధ్య, దిగువ తరగతి కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులకు శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్ చేపట్టాం" అని తెలిపారు. ఐటిఐల్లో విరివిగా చేరాలని విద్యార్థులకు ఆయన విజ్ఞప్తి చేశారు. "మేం పాలకులం కాదు... సేవకులం అనే విషయాన్ని మర్చిపోవడం లేదు. తెలంగాణ రాష్ట్ర సాధనలో నిరుద్యోగ సమస్య అత్యంత కీలక పాత్ర పోషించింది...నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది" అని మరోమారు స్పష్టం చేశారు.

టాటా భాగస్వామ్యంతో ఎటిసి ప్రాజెక్ట్

రాష్ట్రంలోని 65 ఐటిఐలను ఎటిసిలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టిటిఎల్)తో పదేండ్లకుగానూ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఈ కేంద్రాల్లో యువతకు శిక్షణ ఇస్తారు. శిక్షణ ఇచ్చేందుకు 130 మంది నిపుణులను టిటిఎల్ నియమించనున్నది. ఎటిసిల్లో ఏటా 15,860 మందికి ఆరు రకాల దీర్ఘకాల (లాంగ్ టర్మ్) కోర్సుల్లో, 31,200 మందికి 23 రకాల స్వల్ప కాలిక (షార్ట్ టర్మ్) కోర్సుల్లో శిక్షణ అందిస్తారు. పదేండ్లలో రాష్ట్రంలోని ఐటిఐల్లో కేవలం 1.5 లక్షల మంది మాత్రమే శిక్షణ పొందారు. ఈ ఏటీసీలతో రానున్న పదేండ్లలో నాలుగు లక్షల మంది శిక్షణ పొందుతారు. ఐటిఐలను ఎటిసిలుగా మార్చే ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.2,324.21 కోట్లు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.307.96 కోట్లు (13.26 శాతం) కాగా టిటిఎల్ వాటా రూ.2016.25 కోట్లు (86.74). ఎటిసిలు కేవలం వివిధ కోర్సుల్లో శిక్షణకే పరిమితం కాకుండా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా పని చేస్తాయి. అలాగే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, భారీ పరిశ్రమలకు సాంకేతిక కేంద్రాలుగానూ (టెక్నాలజీ హబ్) పని చేస్తాయి. ఎటిసిల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి టిఎల్ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది. ఎటిసిలు భవిష్యత్తులో తమ సేవలను పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థులకు అందజేస్తాయి.

పిజిఇసెట్‌లో ఉత్తీర్ణులు 18,829 మంది

- ఫలితాలు విడుదల చేసిన బుర్రా వెంకటేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎంఇ/ఎంటెక్‌తోపాటు ఎంఫార్మసీ, ఎంఆర్క్, ఫార్మా-డి(పీబీ) కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన పోస్టు గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పిజిఇసెట్) రాత పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. జెఎన్‌టియు హైదరాబాద్‌లో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, జెఎన్‌టియుహెచ్ విసి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి ఈ ఫలితాలను విడుదల చేశారు. పిజిఇసెట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 22,712 మంది దరఖాస్తు చేయగా, 20,626 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 18,829 (91.28 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది 16,563 మంది దరఖాస్తు చేస్తే, 14,882 మంది పరీక్ష రాశారు. వారిలో 13,891 (93.34 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. గతేడాది కంటే ఈ ఏడాది 2.06 శాతం ఫలితాలు తగ్గాయి. ఈ ఏడాది 10,179 మంది అబ్బాయిలు దరఖాస్తు చేయగా, 9,156 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 8,246 (90.06 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. 12,533 మంది అమ్మాయిలు దరఖాస్తు చేస్తే, 11,470 మంది పరీక్ష రాశారు. వారిలో 10,583 (92.27 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. అబ్బాయిల కన్నా అమ్మాయిలు 2.21 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత సాధించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ వి వెంకటరమణ, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, జెఎన్‌టియుహెచ్ రెక్టార్ కె విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ కె వెంకటేశ్వరరావు, పిజిఇసెట్ కన్వీనర్ ఎ అరుణకుమారి, కో-కన్వీనర్ బి రవీంద్రారెడ్డి, కో-ఆర్డినేటర్ బి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

Before the Deputy Registrar of Chits/ Arbitrator at Kakinada
A.A.C.F. No. 86 of 2023

Between:
M/s. Margadarsi Chit Fund Private Limited (Formerly known as Margadarsi Chit Fund Ltd) Rajahmundry Branch, Rep. by its Foreman/ Manager ...*Disputant*
AND
B.Bhaskara Rao & Others ...*Opponents*

Opp-4: Adapa Veera Venkata Durga Ramesh, S/o. A.V.V.Satyanarayana, Hindu, aged 36 years, S.S.E. Accenture Solutions Pvt. Ltd., LIG: 27/2, LIG 4th Phase, KPHP Kukatpally, Hyderabad.

డిస్ప్యూటెంట్ కంపెనీ వారికి రావలసిన బాకీ మొత్తం **రూ. 1,03,447/-లు** రాబట్టుకొనుటకు మీపై దాఖలు చేసిన పై డిస్ప్యూటెంట్‌లో అపోనెంట్-4 అయిన మీకు పైన తెలిపిన ఆఫీసు వారు పోస్టు ద్వారా పంపిన నోటీసులు మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పైన తెలిపిన ఆఫీసు వారి ఆదేశాల ప్రకారము ఈపేపరు ప్రకటన ద్వారా నోటీసు యివ్వటం జరిగినది. కావున మీరు **ది. 06-07-2024వ తేదీన ఉదయం 11.00 గంటలకు** మీరు స్వయముగా గాని లేదా మీ వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలను తెలియచేయవలసి ఉన్నది. లేనిచో మీకు పరోక్షముగా తీర్మానం చేయబడునని యిందు మూలముగా తెలియచేయడమైనది.

DEPUTY REGISTRAR OF CHITS
Kakinada

In the Court of the Addl. Senior Civil Judge, Eluru
I.A. 640/2023, I.A. 227/2020
I.P. 54/2016

Between:
M/s. Lingamallu Silks, Vijayawada. Rep. by its Prop: Lingamallu Venkata Sailesh Kumar and Others ...*Petitioner*
Vs
M/s. Anitha Saree Showroom, Eluru, Rep. by its Partnes: Buragadda Venkata Subba Rao (died) and Others ...*Respondents*
To:
R-5: Kutumbaka Rambabu, S/o. Krishna Mohan, R/o. Plot No. 201, D.No. 3-5-1105, Opp. Blood Bank, Narayanaguda, Himayath Nagar, Hyderabad CCC, Hyderabad.

పై నెంబరు గ్రంథములో I.A. 640/2023 ను 1, 2వ ప్రతివాదుల Partner అయిన 3వ ప్రతివాది Buragadda Venkata Subba Rao చనిపోయినందున వారి వారసులుగా R9 to R12 లను I.A. 227/2020 లో L.R's గా చేర్పించమని కోరుచూ దాఖలు చేసిన పై నెంబరు I.A. లో R5 లకు ఏమైన అభ్యంతరములు ఉన్న యెడల **ది. 26-6-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారు ఎదుట మీరు గాని, ప్లీడరు గారు ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేని యెడల పరోక్షంగా Order Pass చేయబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

P.BHASKARA NARASIMHA MURTHY
Advocate, Eluru. Cell: 9848143125

In the Court of the Addl. Senior Civil Judge, Eluru
I.A. 638/2023, I.A. 227/2020
I.P. 54/2016

Between:
M/s. Lingamallu Silks, Vijayawada. Rep. by its Prop: Lingamallu Venkata Sailesh Kumar and Others ...*Petitioner*
Vs
M/s. Anitha Saree Showroom, Eluru, Rep. by its Partners: Buragadda Venkata Subba Rao (died) and Others ...*Respondents*
To:
R-5: Kutumbaka Rambabu, S/o. Krishna Mohan, R/o. Plot No. 201, D.No. 3-5-1105, Opp. Blood Bank, Narayanaguda, Himayath Nagar, Hyderabad CCC, Hyderabad.

పై నెంబరు గ్రంథములో ఆలస్యమును క్షమించమని దాఖలు చేసిన I.A. 638/2023 ను 1, 2వ ప్రతివాదుల Partner అయిన 3వ ప్రతివాది Buragadda Venkata Subba Rao చనిపోయినందున వారి వారసులుగా R9 to R12 లను I.A. 227/2020 లో L.R's గా చేర్పించమని కోరుచూ దాఖలు చేసిన పై నెంబరు I.A. లో R5 లకు ఏమైన అభ్యంతరములు ఉన్న యెడల **ది. 26-6-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారు ఎదుట మీరు గాని, ప్లీడరు గారు ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేని యెడల పరోక్షంగా Order Pass చేయబడునని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

P.BHASKARA NARASIMHA MURTHY
Advocate, Eluru. Cell: 9848143125

మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

జర్నలిస్టుల సంక్షేమానికి నూతన విధానం

- అక్రిడిటేషన్ల గడువు మరో మూడు నెలలు పెంపు
- త్వరలో హెల్త్ కార్డుల సమస్య పరిష్కారం
- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టుల సంక్షేమం కోసం నూతన విధానం రూపొందిస్తున్నామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలో జరుగుతున్న టియుడబ్ల్యుజె ఐజెయు రాష్ట్ర మహాసభకు వెళ్తూ మంగళవారం మార్గమధ్యలో సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ఇల్లు, ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన దగ్గర్నుంచి శాసనసభ వ్యవహారాలు, ఓటు ఆన్ అకౌంట్, తదుపరి లోక్‌సభ ఎన్నికలు వరుసగా రావడంతో పరిపాలనపై దృష్టి కేంద్రీకరించే విషయం కొంత ఆలస్యమైందని తెలిపారు. మీడియా అకాడమీ చైర్మన్‌గా తాను సమాచార శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డితో చర్చించి జర్నలిస్టుల సంక్షేమ కోసం విధి, విధానాలు రూపొందిస్తే వెంటనే సంతకం చేసి అమలు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని చెప్పారు. హెల్త్ కార్డుల విషయంలో సమస్యలన్నింటినీ త్వరలో పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో 24 వేల అక్రిడిటేషన్లు ఉన్నాయని, అనర్హులకు అక్రిడిటేషన్లు అందకుండా ఒక క్రీమ్ లైన్ ఏర్పాటు చేస్తామని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ తప్పకుండా అక్రిడిటేషన్ వచ్చేలా చేస్తామని చెప్పారు. ఇటీవల రంగారెడ్డి జిల్లాలో జరిగిన కుటుంబం ఆత్మహత్య విషయంలో జర్నలిస్టుల బ్లాక్ మెయిల్ కారణంగా ఆ వృత్తికే మచ్చ పడిందని, ఇలాంటి విషయాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెలతో ముగుస్తున్న అక్రిడిటేషన్ల గడువును మరో మూడు నెలలు పెంచి ఈ లోపు కొత్త అక్రిడిటేషన్ల విషయంలో కసరత్తు ప్రారంభిస్తామని తెలిపారు. ఆయన వెంట టియుడబ్ల్యుజె ఐజెయు రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు కొణిజేటి సత్యనారాయణ, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ కోశాధికారి రాజేష్, యూనియన్ హర్యానా, బీహార్ రాష్ట్రాల అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బంటు కృష్ణ, ఎలక్ట్రాన్ మీడియా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల మల్లికార్జున్, రెబ్బ విజయకుమార్, నాగరాజు, రామకృష్ణ, హరి, జర్నలిస్టులు ఉన్నారు.

14 మంది వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు

- విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఫార్మసిస్ట్ సస్పెన్షన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విధుల్లో నిర్లక్ష్యం వహించిన 14 మంది వైద్య సిబ్బందికి జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బిఎం.సంతోష్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పని చేసే వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ జిల్లా ఏరియా ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి వార్డులోనూ తిరిగి రోగులకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్లు ఎంత మంది నిర్దేశిత సమయానికి వచ్చారని రిజిస్టర్‌లో పరిశీలించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు 14 మందితోపాటు మరో నలుగురు వైద్య సిబ్బంది హాజరు కాలేదు. దాంతో ప్రతిరోజూ వారి హాజరు వివరాలను తెలిపే బయోమెట్రిక్ యంత్రంలోని వివరాలను ప్రింటు తీసి ఇవ్వాల్సిందిగా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌కు సూచించారు. విధులను సరిగా నిర్వహించని 14 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఫార్మసీ స్టోర్ తనిఖీ చేసి స్టాక్ వివరాలు, రిజిస్టర్లు సరిగా నిర్వహించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసి.. ఫార్మసిస్టును వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చే ఇన్ పేషెంట్, అవుట్‌పేషెంట్స్ నమోదు వివరాలు తెలిపే రికార్డులను పరిశీలించారు.

రేవంత్‌తో కుష్‌మన్ సంస్థ ప్రతినిధుల భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ సంస్థ ఆసియా పసిఫిక్ సిఇఒ మ్యాథ్యూ భౌ ప్రతినిధి బృందం సిఎం రేవంత్‌రెడ్డి, ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో భేటీ అయింది. హైదరాబాద్ గ్లోబల్ సిటీ వృద్ధి చెందుతున్న తీరు, వివిధ రంగాల్లో విస్తరిస్తున్న తీరుపై ఈ భేటీలో చర్చించారు. గ్రేటర్ హైదరాబాద్ సిటీ దేశంలోనే శరవేగంగా వృద్ధి చెందుతోందని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ కంపెనీ ప్రతినిధి బృందం ఈ సందర్భంగా తమ అధ్యయన వివరాలను పంచుకుంది. గడిచిన ఆరు నెలల్లో రియల్టీతోపాటు లీజింగ్, ఆఫీస్ స్పేస్, నిర్మాణ రంగం, రెసిడెన్షియల్ స్పేస్‌లోనూ హైదరాబాద్ సిటీ గణనీయమైన వృద్ధి నమోదు చేసిందని అభిప్రాయపడింది. దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాలకు సంబంధించి ప్రతి ఆరు నెలలకోసారి వెల్లడించే తమ నివేదిక జులై నెలాఖరులో వెలువడుతుందని తెలిపింది. తమ ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు రూట్ విస్తరణతోపాటు హైదరాబాద్ మరింత అద్భుతంగా తయారవుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. తాము దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడటంలేదని, హైదరాబాద్‌ను ప్రపంచంలో పేరొందిన నగరాల సరసన నిలబెట్టాలనేది తమ సంకల్పమని పునరుద్ఘాటించారు. తెలంగాణ నుంచి అమెరికాలో ఉంటున్న వారి సంఖ్య, అక్కడి వెళ్లి వచ్చే వారి సంఖ్య పెరిగిపోయిందనీ, అందుకే న్యూయార్క్‌తో పోల్చుకునేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాల్సి ఉందని సీఎం అభిప్రాయపడ్డారు.

In the Court of the Addl. Senior Civil Judge, Eluru
I.A. 227/2020, I.P. 54/2016

Between:
M/s. Lingamallu Silks, Vijayawada. Rep. by its Prop: Lingamallu Venkata Sailesh Kumar and Others ...*Petitioner*
Vs
M/s. Anitha Saree Showroom, Eluru, Rep. by its Partnes: Buragadda Venkata Subba Rao (died) and Others ...*Respondents*
To:
R-5: Kutumbaka Rambabu, S/o. Krishna Mohan, R/o. Plot No. 201, D.No. 3-5-1105, Opp. Blood Bank, Narayanaguda, Himayath Nagar, Hyderabad CCC, Hyderabad.

పై నెంబరు గ్రంథములో I.P. 54/2016 ను ది. 4-12-2017వ తేదీన తమ కోర్టు వారు Dismiss Order ను Set side చేసి I.P. 54/2016 ను Restoring చేయమని కోరుచూ దాఖలు చేసిన పై నెంబర్ I.A లో 5వ ప్రతివాదికి ఏమైన అభ్యంతరములు ఉన్న యెడల **ది. 26-6-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారు ఎదుట మీరు గాని, ప్లీడరు గారు ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేనియెడల పరోక్షంగా Order Pass చేయబడునని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

P.BHASKARA NARASIMHA MURTHY
Advocate, Eluru. Cell: 9848143125

In the Court of the Addl. Senior Civil Judge, Eluru
I.A. 639/2023, I.A. 227/2020
I.P. 54/2016

Between:
M/s. Lingamallu Silks, Vijayawada. Rep. by its Prop: Lingamallu Venkata Sailesh Kumar and Others ...*Petitioner*
Vs
M/s. Anitha Saree Showroom, Eluru, Rep. by its Partners: Buragadda Venkata Subba Rao (died) and Others ...*Respondents*
To:
R-5: Kutumbaka Rambabu, S/o. Krishna Mohan, R/o. Plot No. 201, D.No. 3-5-1105, Opp. Blood Bank, Narayanaguda, Himayath Nagar, Hyderabad CCC, Hyderabad.

పై నెంబరు గ్రంథములో Abatement Petition దాఖలు చేసిన I.A. 639/2023 ను 1, 2వ ప్రతివాదుల Partner అయిన 3వ ప్రతివాది Buragadda Venkata Subba Rao చనిపోయినందున వారి వారసులుగా R9 to R12 లను I.A. 227/2020 లో L.R's గా చేర్పించమని కోరుచూ దాఖలు చేసిన పై నెంబరు I.A. లో R5 లకు ఏమైన అభ్యంతరములు ఉన్న యెడల **ది. 26-6-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారు ఎదుట మీరు గాని, ప్లీడరు గారు ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేని యెడల పరోక్షంగా Order Pass చేయబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

P.BHASKARA NARASIMHA MURTHY
Advocate, Eluru. Cell: 9848143125

LAURUS Labs
Chemistry for Better Living

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: లారస్ ఎన్‌క్లేవ్, ప్లాట్ ఆఫీస్ 01, ఇ. బోనంగి గ్రామం, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా - 531 021, ఆంధ్రప్రదేశ్.
కార్పొరేట్ ఆఫీస్: 2వ అంతస్తు, సెరీన్ ఛాంబర్స్, రోడ్ నెం. 7, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034, తెలంగాణ.
Phone: +91 40 3980 4333; **Fax:** +91 40 3980 4320 | **Email:** secretarial@lauruslabs.com; **Website:** www.lauruslabs.com
కార్పొరేట్ గుర్తింపు సంఖ్య : L24239AP2005PLC047518

కంపెనీ యొక్క 19వ వార్షిక సర్వసభ్య సమావేశం కొరకు ప్రకటన

ఇందుమూలంగా **ప్రకటన** ఇవ్వడమేమనగా, సెక్యూరిటీస్ అండ్ ఎక్చేంజి బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంసిఏ)చే జారీచేయబడిన సర్క్యులర్స్‌తో చదువబడే దాని క్రింది రూల్స్ మరియు కంపెనీల చట్టం, 2013 యొక్క నియమాలను అనుసరించి నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీస్ లిమిటెడ్ (ఎన్ఎస్‌డిఎల్) ద్వారా సమకూర్చబడు **విడియో కాన్ఫరెన్సింగ్ (విసి) సదుపాయం ద్వారా గురువారం, జులై 11, 2024న మ॥ 03.00 గం.లకు లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ ("ది కంపెనీ")** యొక్క సభ్యుల **పంతొమ్మిదవ వార్షిక సర్వసభ్య సమావేశం** ("ఏజియం" లేదా "సమావేశం") నిర్వహించబడుతుంది.

ఆర్థిక సం॥ 2023-24 కొరకు కంపెనీ యొక్క వార్షిక రిపోర్టుతో పాటు సమావేశంలో సాధారణ మరియు ప్రత్యేక ఐటెంలను సమీక్షించుటకు, ఏదైతే మార్చి 31, 2024తో ముగిసిన సం॥ కొరకు ఆడిటెడ్ స్టాండలోన్ & కన్సాలిడేటెడ్ ఆర్థిక నివేదికలు కలిగియున్న మరియు ఆడిటర్స్ & డైరెక్టర్స్ రిపోర్టు, కార్పొరేట్ గవర్నెన్స్ రిపోర్టు, నోటీసు మొ॥ వాటిని శుక్రవారం, జూన్ 14, 2024 తేది రోజున రిజిస్టర్ ఆఫ్ మెంబర్స్‌లో వున్న సభ్యులకు ఇ-మెయిల్ ద్వారా పంపడమైనది. ఇప్పటికీ వారి ఇమెయిల్ ఐడిలు రిజిస్టరు చేసుకోని వాటాదారులు వారి సదరు డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌ను సంప్రదించి ఇమెయిల్ ఐడి రిజిస్టర్ చేసుకోవలసిందిగా కోరబడుచున్నది మరియు నోటీసు మరియు వార్షిక నివేదిక కొరకు కంపెనీకి ఇమెయిల్ పంపిస్తే కంపెనీ దానికి స్పందిస్తుంది. వాటాదారులు తదుపరి వివరాల కొరకు, దినపత్రికల్లో జూన్ 12, 2024న కంపెనీచే ప్రచురించబడిన ప్రకటనను చూడవచ్చును.

నోటీసు మరియు వార్షిక నివేదికను మా వెబ్‌సైట్ www.lauruslabs.com నుండి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఏజియం వద్ద సమీక్షించు ఐటెంలకు సంబంధించిన ఏవేని పత్రాలను పరిశీలించుట కొరకు, వాటాదారులు secretarial@lauruslabs.com ఇ-మెయిల్‌కి వ్రాయవచ్చును మరియు కంపెనీ వారికి స్పందిస్తుంది.

పైన చెప్పిన సర్క్యులర్ ప్రకారం, రిమోట్ ఇ-ఓటింగ్, విడియో కాన్ఫరెన్సింగ్ (విసి) అదే విధంగా సమావేశం జరుగునప్పుడు ఇ-ఓటింగ్ కొరకు సదుపాయం కల్పించుటకు అధీకృత ఏజెన్సీగా నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీస్ లిమిటెడ్ (ఎన్ఎస్‌డిఎల్) సేవలను కంపెనీ వినియోగిస్తుంది.

సెక్యూరిటీస్ అండ్ ఎక్చేంజి బోర్డ్ ఆఫ్ ఇండియా (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ & డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 44 మరియు కంపెనీస్ (మేనేజ్‌మెంట్ & అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014 యొక్క రూల్ 20తో చదువబడే కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 108 యొక్క నియమాలను అనుసరించి, కంపెనీ జులై 11, 2024న నిర్వహించబడు 19వ ఏజియం యొక్క నోటీసులో ఇచ్చినట్లు వ్యాపార ఐటెంలపై ఎలక్ట్రానిక్ ఓటింగ్ సిస్టమ్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకొనుటకు సభ్యులకు కంపెనీ సదుపాయం కల్పిస్తుంది. సభ్యులు ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానం వినియోగించి వారి ఓట్లను ఏ ప్రదేశం నుండి అయిన వేయవచ్చును (రిమోట్ ఇ-ఓటింగ్). రిమోట్ ఇ-ఓటింగ్ జులై 08, 2024న ఉ॥ 09.00 గం.లకు ప్రారంభమై మరియు జులై 10,2024న సా॥ 05.00 గం.లకు ముగించబడుతుంది. పై సదరు తేది & సమయం దాటిన తరువాత రిమోట్ ఇ-ఓటింగ్ అనుమతించబడదు మరియు రిమోట్ ఇ-ఓటింగ్ మాడ్యూల్ జులై 11, 2024న సా॥ 5గం.ల తరువాత మూసివేయబడుతుంది. కటాఫ్ తేదీ నాటికి అనగా., గురువారం, జులై 04, 2024 నాటికి సభ్యుల రిజిస్టర్ / బెనెఫిషల్ ఓనర్స్ రిజిస్టర్‌లో ఎవరి పేర్లైతే కనిపించునో అట్టి వ్యక్తి మాత్రమే రిమోట్ ఇ-ఓటింగ్ / సమావేశంలో ఇ-ఓటింగ్ సదుపాయం పొందుటకు అనుమతించబడుదురు. ఏజియం నిమిత్తం కంపెనీ యొక్క సభ్యుల రిజిస్టర్ మరియు షేర్ ట్రాన్స్‌ఫర్ బుక్స్ జులై 05, 2024 నుండి జులై 11, 2024 (రెండు రోజులతో సహా) వరకు మూసి ఉంచబడుతాయి.

సమావేశం నోటీసు పంపబడిన తరువాత ఎవరైనా కంపెనీ యొక్క సభ్యుడైన మరియు కటాఫ్ తేదీ నాటికి వాటాలు కలిగియున్న, వారు ఇ-ఓటింగ్ సదుపాయం పొందుట కొరకు వారి సదరు డిపాజిటరీస్‌తో సంప్రదించవచ్చును. ఇ-ఓటింగ్ సదుపాయం పొందుటకు వివరణాత్మక విధానం సమావేశపు నోటీసులో కూడా ఇవ్వబడినవి మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్ పై అందుబాటులో ఉంటుంది.

రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా వారి ఓటువేసిన ఎవరైనా సభ్యులు సమావేశానికి హాజరవచ్చును, కాని సమావేశంలో వారు తిరిగి ఓటువేయుటకు అనుమతించబడరు.

సమావేశం వ్యవధిలో ఇ-ఓటింగ్ కొరకు సదుపాయం అందుబాటులో ఉంటుంది మరియు ఎవరైతే రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా ఓటువేయని సభ్యులు వారి ఓటును సమావేశం కాలవ్యవధిలో వారు వినియోగించుకోవచ్చును.

డిపాజిటరీ అనగా, ఎన్ఎస్‌డిఎల్ మరియు సిడిఎస్ఎల్ ద్వారా లాగిన్‌కు సంబంధించిన ఏవేని సాంకేతిక సమస్యల కొరకు డీమ్యాట్ విధానంలో వాటాలు కలిగియున్న వాటాదారుల కొరకు హెల్ప్‌డెస్క్:

లాగిన్ రకం	హెల్ప్‌డెస్క్ వివరాలు
ఎన్ఎస్‌డిఎల్ తో డీమ్యాట్ విధానంలో వాటాలు కలిగియున్న వాటాదారులు	ఇ-మెయిల్: evoting@nsdl.com or నెం. : 022 - 4886 7000 కి కాల్ చేయండి
సిడిఎస్ఎల్ తో డీమ్యాట్ విధానంలో వాటాలు కలిగియున్న వాటాదారులు	ఇ-మెయిల్: helpdesk.evoting@cdslindia.com or టోల్ ఫ్రీ నెం. : 1800 22 55 33 కి కాల్ చేయండి

బోర్డు ఆదేశం మేరకు
లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ తరపున
సం/- **జి. వెంకటేశ్వర్ రెడ్డి**
కంపెనీ సెక్రటరీ & కంప్లైన్స్ ఆఫీసర్

ప్రదేశం : హైదరాబాద్
తేది: 18.06.2024

విలువల కోసం పాటుపడ్డ మహనీయుడు ఎంహెచ్

- అన్ని రంగాల్లోనూ ఆయన నిష్ణాతులు
- ఎంహెచ్ వర్థంతిలో చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిజంలో విలువల కోసం పాటుపడ్డ మహనీయుడు మోటురు హనుమంతరావు అనీ, ఆయన అన్ని రంగాల్లోనూ నిష్ణాతులని నవతెలంగాణ సబ్‌కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతరాములు కొనియాడారు. మంగళవారం హైదరాబాద్‌లోని నవతెలంగాణ దినపత్రిక కార్యాలయంలో ఎంహెచ్ వర్థంతిని నిర్వహించారు. ఎంహెచ్ చిత్రపటానికి సీతరాములు, నవతెలంగాణ సిజిఎం పి ప్రభాకర్, ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీతరాములు మాట్లాడుతూ..మోటూరు హనుమంతరావు స్వాంతత్ర్య ఉద్యమంలోనూ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోనూ పాలుపంచుకున్నారని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా, రాజ్యసభ సభ్యులుగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కొట్లాడారన్నారు. ఎంహెచ్ జీవితం గురించి అధ్యయనం చేయాలని సూచించారు. ఆయన ప్రజాశక్తి పత్రికకు వన్నె తెచ్చారనీ, ఆయన రాసిన ఎడిటోరియల్స్, సైద్ధాంతిక వ్యాసాలు ఎంతో పేరు తెచ్చిపెట్టాయని గుర్తుచేశారు.

ఆయన ప్రతి అంశంపైనా విపరీతంగా అధ్యయనం చేసేవారనీ, తాను అధ్యయనం చేసిన దాని గురించి ప్రజలకు విడమర్చి చెప్పడంలో నేర్పరి అని కొనియాడారు. అప్పట్లో ప్రజలకు, కార్యకర్తలకు ప్రజాశక్తి వారపత్రిక దిక్సూచిగా ఉండేదన్నారు. కమ్యూనిస్టు పార్టీల చీలిక సమయాల్లో అతివాద, మితవాదం మీద ఆయన పెద్ద పోరాటమే చేశారన్నారు. దేశంలో సమసమాజాన్ని నిర్మించాలనే ఒక లక్ష్యం కోసం జీవితాంతం నిజాయితీగా పనిచేసిన గొప్ప నాయకుల్లో ఆయన ఒకరని కొనియాడారు. సిపిఎంను విప్లవపార్టీగా తీర్చిదిద్దడంలో ఎంహెచ్ కృషి మరువలేనిదన్నారు. ఆయన స్ఫూర్తితో విప్లవ లక్ష్యాల కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆయన ప్రతి ఒక్కరినీ అప్యాయంగా పలుకరించేవారనీ, ప్రజలతో, కార్యకర్తలతో, నాయకులతో ఎంతో అన్యోన్యంగా ఉండేవారని గుర్తుచేశారు. అడ్వర్టజ్‌మెంట్, పెయిడ్ న్యూస్ పేరుతో పత్రికారంగంలో విలువలు పడిపోతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. విలువలను, నవతెలంగాణ పత్రిక నాణ్యతను పెంచేలా సిబ్బంది తమ వంతు కృషి చేయాలని కోరారు. నవతెలంగాణ ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్ మాట్లాడుతూ...ప్రజాశక్తి పత్రికను ముందుకు తీసుకెళ్లడంలో ఎంహెచ్ కీలకపాత్ర పోషించారనీ, ఆయన రాసిన వ్యాసాలు సైద్ధాంతిక చర్చకు దారితీసేవని గుర్తుచేశారు. సమాజాన్ని వివిధ కోణాల్లో చూసి ప్రజలకు అర్థమయ్యేలా విడమర్చి చెప్పడం, రాయటం కీలకమన్నారు. కార్యక్రమంలో నవతెలంగాణ న్యూస్ ఎడిటర్ రాంపల్లి రమేశ్, బుక్‌హౌజ్ ఎడిటర్ ఆనందాచారి, బ్యూరోచీఫ్ పద్మరాజు, జనరల్ మేనేజర్లు వెంకటేశ్, రఘు, శశిధర్, మేనేజర్లు, బోర్డు సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంహెచ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చెరుపల్లి సీతారాములు

టాటా కాపిటల్‌తో ఎంజి మోటార్ ఒప్పందం

న్యూఢిల్లీ : ఛానల్ ఫైనాన్స్ ఆప్షన్స్ మెరుగుపరచడానికి టాటా కాపిటల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా వెల్లడించింది. దీంతో తమ వాహన కొనుగోలుదారులకు సులభంగా రుణాలు, సరళమైన తిరిగి చెల్లింపుల అవధి, పోటీయుత వడ్డీతో అనుకూలంగా రూపొందించబడిన ఫైనాన్సింగ్ ఆప్షన్స్ లభించనున్నాయని ఆ సంస్థ పేర్కొంది. ఈ ఒప్పందంపై టాటా కాపిటల్ ఎస్ఎంఇ సిఇఒ నరేంద్ర కామత్, జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సుతీందర్ సింగ్ బజ్వా సంతకాలు చేశారు.

స్కోడా నుంచి సరికొత్త కుషాక్, స్లావియా

న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల కంపెనీ స్కోడా ఆటో ఇండియా సరికొత్తగా కుషాక్, స్లావియా వేరియంట్లను విడుదల చేసినట్లు ప్రకటించింది. భద్రతలో 5 స్టార్ రేటింగ్ కలిగిన నూతన వేరియంట్‌లు 1.0 టిఎస్ఐ పెట్రోల్ వర్షన్, 1.5 టిఎస్ఐ పెట్రోల్ వర్షన్లలో లభ్యమవుతుందని ఆ సంస్థ తెలిపింది. కుషాక్ లీటర్‌కు 19.76 కిలోమీటర్లు, స్లావియా 20.32 కిలోమీటర్ల మైలేజీని ఇస్తాయని తెలిపింది. వీటి ప్రారంభ ధరను రూ.10.69 లక్షలుగా నిర్ణయించింది.

హాయర్ ఫినిక్స్ శ్రేణి రిఫ్రిజిరేటర్ల విస్తరణ

న్యూఢిల్లీ: ప్రముఖ గృహోపకరణాల ఉత్పత్తుల కంపెనీ హయర్ ఇండియా తన డైరెక్ట్ కూల్ ఫీనిక్స్ శ్రేణి రిఫ్రిజిరేటర్లను విస్తరించినట్లు ప్రకటించింది. 185, 190 లీటర్ల సామర్థ్యంలో అందుబాటులో ఉన్నాయని హయర్ అప్లయన్సెస్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్ఎస్ సతీష్ తెలిపారు. ఇవి రూ. 21,000 ధరతో ప్రారంభమవుతాయన్నారు. రెండు మోడళ్లపై 10 సంవత్సరాల కంప్రెసర్ వారంటీని అందిస్తోంది.

విల్ప్‌తో ఎంఎస్ఎన్ లాబరేటరీస్ భాగస్వామ్యం

హైదరాబాద్ : తమ ఫార్ములేషన్ యూనిట్లలోని యువ ఉద్యోగులకు విద్యా అవకాశాలను పెంచడానికి బిర్లా ఇన్స్‌ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) పిలానీకి చెందిన వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రాం (విల్ప్)తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ ఎంఎస్ఎన్ లాబరేటరీస్ తెలిపింది.బ వేగవంతంగా వృద్ధి చెందుతున్న ప్రపంచ ఫార్మాస్యూటికల్ పరిశ్రమ పరిణామానికి అనుగుణంగా, నిర్దేశిత బాధ్యతల కోసం తమ ఉద్యోగులను సిద్ధం చేయడంతో పాటుగా తమ నిపుణులకు సహాయం చేయడం ఈ భాగస్వామ్య లక్ష్యమని ఎంఎస్ఎన్ లాబరేటరీస్ సిఎండి ఎంఎస్ఎన్ రెడ్డి అన్నారు.

హరీశ్‌రావు చిల్లర మాటలు మానుకో

- ప్రభుత్వ విప్‌లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై చిల్లర మాటలు మానుకోవాలని ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హెచ్చరించారు. పోర్లు దండాలు పెట్టినా ఆయనకు పార్టీ పగ్గాలు ఇవ్వబోరని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీని బిజెపిలో విలీనం చేస్తారని తెలిపారు. మంగళ వారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. హరీశ్‌రావు తన స్థాయికి అనుగుణంగా మాట్లాడాలని వారు సూచించారు.

వర్షాల నేపథ్యంలో వ్యాధులు పెరిగే ప్రమాదం

- జాగ్రత్తలు తీసుకోండి : వైద్యారోగ్యశాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీవర్షాలు పడే అవకాశమున్న నేపథ్యంలో వ్యాధులు కూడా ప్రబలే ప్రమాదముందని వైద్యారోగ్యశాఖ హెచ్చరించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ బి.రవీందర్ నాయక్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాతావరణంలో తేమ శాతం పెరగడంతో వైరల్ ఇన్ఫెక్షన్లు, దోమలు, ఆహార, నీటి సంబంధిత వ్యాధులు పెరిగే ప్రమాదముందని తెలిపారు. మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా తదితర దోమల ద్వారా వచ్చే వ్యాధుల బారిన పడకుండా దోమతెరలు, స్క్రీన్‌లు ఉపయోగించాలని సూచించారు. దోమలు పెరిగేందుకు ఎక్కువగా అవకాశమున్న ఉదయం, సాయంత్రం వేళల్లో తలుపులు, కిటికీలు సరిగ్గా మూసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా పిల్లలకు తేలిక రంగులతో కూడిన దుస్తులను వేయాలనీ, అవి కూడా చేతులను, కాళ్లను పూర్తిగా కవర్ చేసేలా చూసుకోవాలని పేర్కొన్నారు. బయటికి వెళ్లే సమయంలో మస్కిటో రిపెల్లెంట్ క్రీములను ఉపయోగించాలని సూచించారు.

"వర్షకాలంలో నీటి సంబంధిత వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశముంది. బయటి నీరు తాగకుండా ఇంట్లో కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలి. భోజనానికి ముందు, తర్వాత, వాష్‌రూం ఉపయోగించునే సమయంలో తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలి. బయటి ఆహారాన్ని తీసుకోవద్దు. ముఖ్యంగా సగం కోసినవి, కవర్ చేయని వాటి జోలికి వెళ్లొద్దు ..." అని రవీందర్ నాయక్ సూచించారు. తద్వారా జాండీస్, టైఫాయిడ్ బారిన పడకుండా జాగ్రత్త పడొచ్చని తెలిపారు.

"వర్షాకాలంలో వైరల్ ఫీవర్లు కూడా ప్రజలను పెద్ద ఎత్తున ఇబ్బంది పెడుతుంటాయి. అనారోగ్యంతో ఉన్నవారితో చేతులు కలపడం, ఆహారం, నీరు, దుస్తులు పంచుకోవడం లాంటివి చేయకూడదు. ఇన్ఫెక్షన్ బారిన పడకుండా చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలి. తుమ్మినా, దగ్గినా ఇతరులు ఇన్ఫెక్షన్ బారిన పడకుండా మూతిని కవర్ చేసుకోవాలి. దగ్గు, జలుబు ఉంటే డిస్పోజబుల్ టి ష్యూలను ఉపయోగించుకోవాలి. ఒక వేళ జ్వరంతో పాటు దగ్గు, తలనొప్పి, గొంతునొప్పి, ఒళ్లు నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వాస్పత్రులను సంప్రదించాలి. అత్యవసరమైతే 108 అంబులెన్స్‌కు కాల్ చేయాలి." అని డాక్టర్ రవీందర్ నాయక్ సూచించారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాం

వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు ఆయా వ్యాధుల బారిన పడితే ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి తగ్గించేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసిందని డాక్టర్ బి.రవీందర్ నాయక్ తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక బెడ్లు, ఐవీ ఫ్లూయిడ్లు, అత్యవసర మందులు, అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఉపయోగించుకునేందుకు ఏఎన్ఎం, ఆశాలు, అంగన్ వాడీలకు ఒఆర్ఎస్ సాచెట్లను పంపిణీ చేసినట్టు వెల్లడించారు.

కూచనపల్లిలో దారుణం

అర్ధరాత్రి వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరుబయట నిద్రిస్తున్న ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని కూచనపల్లి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గీకూరు నరసయ్య(55) సోమవారం రాత్రి ఇంటి బయట నిద్రించగా.. గుర్తు తెలియని దుండగులు మారణాయుధాయలతో దాడి చేసి నరికి చంపారు. నరసయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. తెల్లవారుజామున స్థానికులు చూసి పోలీసులకు సమాచారమందించారు. సిఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేష్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంతో పరిశీలించారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పంచాయతీ కార్యదర్శి రాజమ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. హత్యకు గల కారణాలు ఇప్పటి వరకు తెలియలేదు.

24 నుంచి జూనియర్ డాక్టర్ల సమ్మె

- డిఎంఇకి నోటీసు అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 24 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్టు తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) తెలిపింది. ఈ మేరకు మంగళారం అసోసియేషన్ నాయకులు రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ వాణిని కలిసి సమ్మె నోటీసును అందజేశారు. గత నెలలోనే సమ్మె నోటీస్ ఇచ్చినప్పటికీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో తాత్కాలికంగా సమ్మెను వాయిదా వేశారు. అయితే తాము ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్లలో ఒక్క డిమాండ్‌నూ తీర్చలేదనీ, అందుకే తప్పనిసరి పరిస్థితిలో సోమవారం నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్టు వారు తెలిపారు. గతంలో నోటీసు ఇచ్చి దాదాపు నెల గడిచినా ఎటువంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నుంచి అనుకూలమైన చర్యలు లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. డిమాండ్లను నెరవేర్చడంలో సంబంధిత అధికారులు చొరవ తీసుకుంటే మెరుగైన ఆరోగ్య సేవలందించేందుకు వీలుంటుందని సూచించారు. నిర్దేశిత సమయంలో ఉపకార వేతనాల విడుదల, పెండింగ్ స్టైఫండ్స్ విడుదల, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్లకు గతంలో ఒప్పుకున్న మేరకు స్టైఫండ్, ఆంధ్రప్రదేశ్ సీట్లలో తెలంగాణ విద్యార్థులకు 15 శాతం రిజర్వేషన్, ప్రభుత్వాస్పత్రుల్లో భద్రత, పోస్ట్ గ్రాడ్యుయేట్లకు సరిపడేలా కొత్త హాస్టళ్ల నిర్మాణం, ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి కొత్త భవన నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. డిఎంఇని కలిసి నోటీసు అందజేసిన వారిలో అసోసియేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ డి.శ్రీనాథ్, అధ్యక్షులు డాక్టర్ సిహెచ్‌జి సాయి శ్రీహర్ష, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె ఐజక్ న్యూటన్ తదితరులున్నారు.

20 శాతం మించకుండా బదిలీలు చేయాలి

- తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే ఉద్యోగులు, డాక్టర్ల బదిలీల్లో 20 శాతం మించకుండా చేయాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టిజిజిడిఎ) డిమాండ్ చేసింది. మంగళవారం హైదరాబాద్‌లోని వైద్య విద్య సంచాలకుల కార్యాలయం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఉస్మానియా యూనిట్ (2024-26) అధ్యక్షులు డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.రంగా, కోశాధికారి డాక్టర్ టి.శంకర్ సింగ్, జనరల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ పి.ప్రవీణ్, డాక్టర్ బి.రమేశ్, డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడారు. 20 శాతానికి మించి అనుమతిస్తే అత్యవసర సేవలు, రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు అనుభవజ్ఞులైన డాక్టర్లు ఉండరని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో చేసిన బదిలీలు కూడా 20 శాతానికి మించి చేయలేదని గుర్తుచేశారు. గతంలో ఇచ్చినట్టుగానే ఉద్యోగ సంఘం సభ్యులకు బదిలీల నుంచి ఖచ్చితంగా మినహాయింపునివ్వాలని కోరారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘం తమదేననీ, వేరే ఇతర గుర్తింపు లేని సంఘం డిఎంఈ ద్వారా సిఫారసు చేయించుకుంటున్నట్టు తెలుస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే బదిలీల పేరుతో లక్షలాది రూపాయల వసూళ్లు చేస్తున్నారనీ, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తమపై అనవసర ప్రచారం మానుకోవాలనీ, ఆర్థికశాఖ ఇచ్చే ఉత్తర్వుల అమలుకు తాము సహకరిస్తామని స్పష్టం చేశారు. అడిషనల్ డిఎంఇ, ఇతర పదోన్నతులు చేపట్టిన తర్వాతే బదిలీల ప్రక్రియ చేయాలని సూచించారు.

ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణం వెంటనే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కొత్త వైద్యకళాశాలల్లో పని చేసే డాక్టర్లకు 30 శాతం నుంచి 50 శాతం అదనంగా వారి బేసిక్ పేపై అలవెన్స్ ఇస్తూ జీవో జారీ చేయాలని కోరారు. గతంలో డాక్టర్లకు ఇచ్చిన్న ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, ఈఎల్ సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ అలవెన్స్‌ను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ఏ ప్రభుత్వ వైద్యులైన స్వచ్ఛంద పదవీ విరమణ కోరుకుంటే వారికి వెంటనే అనుమతితో పాటు అన్ని రకాల ప్రతిఫలాలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఆల్ప్రా జోలంను పరిశీలిస్తున్న టిజి ఎన్ఎబి పోలీస్ అధికారులు

2.6 కిలోల నిషేధిత ఆల్ప్రా జోలం పట్టివేత

- వెల్లడించిన జిల్లా ఎస్‌పి రూపేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిషేధిత ఆల్ప్రాజోలం మత్తు పదార్థాల తయారీ కేంద్రంపై టిజి ఎన్ఎబి పోలీస్ అధికారులు దాడులు నిర్వహించి 2.6 కిలోల నిషేధిత ఆల్ప్రా జోలంను పట్టుకున్నారు. దాని విలువ రూ.కోటి వరకు ఉంటుందని అంచనా. ఇందుకు సంబంధించి సంగారెడ్డి జిల్లా ఎస్‌పి రూపేష్ విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుమ్మడిదల మండలంలోని కొత్తపల్లి గ్రామ పరిధిలో గల సర్వే నంబర్ 174/28 వ్యవసాయ పంట పొలంలోని పౌల్ట్రీఫామ్‌లో నిషేధిత ఆల్ప్రాజోలం మత్తు పదార్థాల తయారీ జరుగుతున్నదని పోలీసులకు సమాచారం అందింది. దాంతో మంగళవారం ఆ తయారీ కేంద్రంపై టిజి ఎన్ఎబి జిల్లా పోలీస్ అధికారులు దాడులు నిర్వహించి 2.6 కిలోల నిషేధిత ఆల్ప్రాజోలం మత్తు పదార్థాలను పట్టుకున్నారు. దాని విలువ కోటి రూపాయలు ఉంటుంది. ఈ చిన్నతరహా పరిశ్రమ నుంచి హైదరాబాద్, సంగారెడ్డి తదితర ప్రాంతాలకు మత్తు పదార్థాలను ఎగుమతి చేసినట్టు పోలీసులు గుర్తించారు. మత్తు పదార్థాలకు వాడిన యంత్రాలను, ముడి సరుకును సీజ్ చేశారు. ఈ మత్తు పదార్థాల తయారీలో నలుగురు నిందితులు ఉండగా.. అందులో ఒకరు వేరే కేసులో జైల్లో ఉన్నారు. మరొక వ్యక్తి పరారీలో ఉన్నాడు. ప్రస్తుతం ఇద్దరిని అరెస్టు చేశారు. నిందితులపై వివిధ సెక్షన్లు నమోదు చేసి ఉన్నత న్యాయస్థానంలో హాజరుపరుస్తామని ఎస్‌పి చెప్పారు.

ఇపి ఆపరేటర్ ట్రైనీ డ్రైవింగ్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌లు

- 1705 మంది దరఖాస్తు : సింగరేణి ఆర్జీ-1 జిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇపి ఆపరేటర్ ట్రైనీ డ్రైవింగ్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌లను సింగరేణి ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ మంగళవారం గోదావరిఖనిలోని స్థానిక జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ.. ఇసి ఆపరేటర్‌ల డ్రైవింగ్ పరీక్షలకు కంపెనీ వ్యాప్తంగా 1705 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆర్జీ-1 నుంచి 330 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా వీరికి ఈ నెల 18 నుంచి 20 వరకు ఈపీ ఆపరేటర్ ట్రైనీ డ్రైవింగ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ఈ నెల 30న కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జిఎం రామ్మోహన్, ఎజిఎం పర్సనల్ సిహెచ్ లక్ష్మి నారాయణ, పర్సనల్ మేనేజర్ (కార్పొరేట్) ప్రకాష్, ఎజిఎం ఐఇడి ఆంజనేయులు, పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు, టిటిసి వెంకట రమణ, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సారంగపాణి, శ్రావణ్ కుమార్, హన్మంతరావు, దుర్గాప్రసాద్, ఇక్బాల్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎండిసి కొత్త ఆర్అండ్‌డి సెంటర్ ఏర్పాటు

- హైదరాబాద్‌లో రూ.50 కోట్లతో నిర్మాణం

హైదరాబాద్ : ప్రముఖ ముడి ఇనుప ఖనిజం ఉత్పత్తిదారు ఎన్ఎండిసి లిమిటెడ్ హైదరాబాద్ పటాన్‌చేరులో కొత్త పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డి) సెంటర్‌ను ఏర్పాటు చేసింది. మంగళవారం దీనిని ఆ సంస్థ సిఎండి అమితవ ముఖర్జీ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో ఆర్అండ్‌డి కోసం రూ.150 కోట్ల పెట్టుబడులు పెట్టామన్నారు. కొత్త ఆర్అండ్‌డి సెంటర్ కోసం రూ.50 కోట్లు వ్యయం చేశామన్నారు. ఆర్అండ్‌డి ద్వారా భారతీయ మైనింగ్ పరిశ్రమను స్థిరమైన భవిష్యత్తు వైపు ఆవిష్కరింపజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తాము ఇక్కడ పరిశోధనలో మాత్రమే పెట్టుబడి పెట్టడం లేదని.. దేశ భవిష్యత్తు కోసం వ్యయం చేస్తున్నామన్నారు. కొత్త సెంటర్‌లో అత్యాధునిక ప్రయోగశాలలు ఉన్నాయి. ఇవి సుస్థిర ఖనిజ సాంకేతికత. ధాతువు శుద్దీకరణలో ఆవిష్కరణలను ప్రోత్సహిస్తాయి. నిపుణుల బందంచే నిర్వహించబడుతుందని ఆ వర్గాలు తెలిపాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన నల్లగొండ జిల్లా కనగల్లు మండలం బాబా సాహెబ్ గూడెం స్టేజి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. కనగల్ ఎస్ఐ బి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలం గోవిందన్నగూడెం గ్రామానికి చెందిన కొండ కృష్ణయ్య, అతని కూతురు కొండ అరుంధతి (22) మోటార్ సైకిల్‌పై ఉదయం 6 గంటల సమయంలో నల్లగొండ పట్టణంలోని అయ్యప్పస్వామి గుడికి బయలుదేరారు. బాబాసాహెబ్ గూడెం స్టేజి వద్దకు చేరుకోగానే హాలియా వైపు నుంచి నల్లగొండకు మోటార్ సైకిల్‌పై వస్తున్న తిరుమలగిరి గ్రామానికి చెందిన బత్తుల పవన్ కుమార్ (23) వెనుక నుంచి కృష్ణయ్య వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. దీంతో పవన్ కుమార్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అరుంధతి తలకు, ఆమె తండ్రికి తీవ్ర గాయాలు కాగా, 108 అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అరుంధతిని పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్టు తెలిపారు. మృతురాలి తల్లి కొండా లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నీట్ రద్దుకు కదం తొక్కిన విద్యార్థులు

- 24 లక్షల విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవడం న్యాయమేనా?
- అక్రమాలపై సుప్రీం జడ్జితో విచారణకు డిమాండ్
- స్పందించకుంటే కేంద్ర మంత్రులను అడ్డుకుంటాం
- రాష్ట్ర విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ
- నీట్ పేపర్ లీకేజీపై హైదరాబాద్‌లో 'స్టూడెంట్ మార్చ్'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అవకతవకలు జరిగిన ప్రతిష్టాత్మక నీట్ పరీక్షను రద్దు చేయాలంటూ విద్యార్థి, యువజన లోకం కదం తొక్కింది. మోడీ ప్రభుత్వం మౌనం వీడాలంటూ హైదరాబాద్ నగరం నడిబొడ్డున గర్జించింది. నీట్ పరీక్షలో అవకతవకలు, పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని, తక్షణమే నీట్ పరీక్ష నిర్వహించిన ఏజెన్సీ ఎన్‌టిఎను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలని, పేపర్ లీకేజీకి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ వై-జంక్షన్ నుంచి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు స్టూడెంట్ మార్చ్ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తోపాటు విద్యార్థి, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు పాల్గొని ప్రసంగించారు. దేశంలో నీట్ పరీక్ష మే ఐదున జరిగిందని.. అంతకంటే ముందే బీహార్‌లో పేపర్‌ను రూ.30 నుంచి 50 లక్షల వరకు అమ్ముకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హర్యానాలో హిందీ మీడియం బదులుగా ఇంగ్లీషు మీడియం పేపర్ ఇచ్చారనే పేరుతో విద్యార్థులు బయటకు వస్తే పరీక్ష ఆలస్యంగా జరిగిందనే కారణంగా గ్రేస్ టైమ్ అంటూ మార్కులు ఇచ్చారని, గుజరాత్‌లో పేపర్‌ను రూ.పది లక్షలకు అమ్ముకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ నిర్లక్ష్యం.. తప్పులకు విద్యార్థులను శిక్షించడం తగదన్నారు. గ్రేస్ మార్కులు పొందిన 1563 మంది విద్యార్థుల మార్కులు రద్దు చేసి వారికి మాత్రమే రీ-ఎగ్జామ్ నిర్వహిస్తామని సుప్రీంకోర్టుకు చెప్పడం అంటే తప్పించుకోవడమేనన్నారు. అవకతవకలకు పాల్పడిన, పేపర్ అమ్ముకున్న ఎన్‌టిఎ చైర్మన్, డైరెక్టర్ల పాత్రపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఎన్‌టీఏను రద్దు చేసి తిరిగి ఆయా రాష్ట్రాలు పరీక్ష నిర్వహించుకునే వెసులుబాటు ఇవ్వాలని కోరారు. కేంద్ర మంత్రులు దీనిపై స్పందించడం లేదని, పరీక్ష పే చర్చ అనే మోడీ.. పరీక్షలు, పేపర్ లీకేజీలపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. స్వయంగా విద్యాశాఖ మంత్రే రెండుచోట్ల అవకతవకలు జరిగాయని ఒప్పుకున్న తర్వాత ప్రధాని మౌనం పాటించడం వెనుక ఎవరి ప్రయోజనాలు ఉన్నాయని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న రాజకీయ పాత్రపైనా.. బిజెపి నాయకులకు చెందిన కన్సల్టెన్సీ యాజమాన్యాలపైనా విచారణ జరిపి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఈ సమస్యపై మాట్లాడకుంటే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు.

స్టూడెంట్ మార్చ్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఆజాద్, విజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్, పిడిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పరుశురాం, మహేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, పివైఎల్ రాష్ట్ర కార్యదర్శి కెఎస్ ప్రదీప్, విద్యార్థి నేతలు ఎస్ రజనీకాంత్, ఎం మమత, డి కిరణ్, కె అశోక్ రెడ్డి, బి శంకర్, లెనిన్, రమ్య, ప్రణయ్, (ఎస్ఎఫ్ఐ), చందన రెడ్డి, విష్ణు, అభిషేక్, ముజ్జు (ఎన్ఎస్‌యూఐ), మణికంఠ రెడ్డి, గ్యార నరేష్, రఘురాం, సత్య, క్రాంతి, పార్థు, నజీర్ (ఎఐఎస్ఎఫ్), పెద్దింటి రామకృష్ణ, అనిల్ (పిడిఎస్‌యు), గడ్డం శ్యామ్ (పిడిఎస్‌యు), ఎండి జావేద్, హస్మిబాబు (డివైఎఫ్ఐ), శ్రీనివాస్, సత్య, (ఎఐవైఎఫ్), కిషన్ (పివైఎల్), యూత్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.